



మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సద్గురు సర్వేశ్వరా శివయోగమని

జై శివాజీ

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా సోమవారం మెదక్, సంగారెడ్డి జిల్లాలు కాషాయమయంగా మారాయి. పలు మండల కేంద్రాల్లో, గ్రామాల్లో బైక్ శోభాయాత్రలను నిర్వహించారు. శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన పాలనను స్మరించుకున్నారు.



మళ్లీ బీజేపీలోకి విజయ్‌పాల్‌రెడ్డి

- అసెంబ్లీ ఎన్నికల వేళ నారాయణఖేడ్ టికెట్ నిరాకరణతో బీఆర్ఎస్ గూటికి చేరిన మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఫిబ్రవరి 19: నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. విజయపాల్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌ను నిరాకరించడంతో బీఆర్ఎస్‌లో చేరగా.. తాజాగా ఆయన సొంత గూటికి వచ్చారు. ఆయనను రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కండువా కప్పి, పార్టీలో చేర్చుకున్నారు. విజయపాల్‌రెడ్డి వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారుతీరెడ్డి, కంగ్టి మాజీ ఎంపీపీ శివాజీపాటిల్, ముత్యాల సురేష్, నర్సింహాగౌడ్, గోవింద్‌నాయక్, తదితరులు ఉన్నారు. నారాయణఖేడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి స్వయాన సోదరులు. చేరిక కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు అమర్‌సింగ్, అనంత్‌రావు కులకర్ణి, తదితరులు ఉన్నారు.



కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరుతున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి

డబుల్ బెడ్‌రూంల.. గతేంటి?

- ఇళ్లు మంజూరై ఎనిమిదేళ్లు.. ఉమ్మడి జిల్లాలో సగానికిపైగా నిర్మాణం పూర్తి
- వేల సంఖ్యలో అసంపూర్తిగానే.. పలుచోట్ల ఇంకా ప్రారంభానికే నోచని పనులు
- పూర్తయిన వాటిలో కొన్నింటిలో మౌలిక వసతులు కరువు
- సిద్ధమైన వాటినీ పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం.. మిగతా వాటి సంగతి ఇక అంతేనా?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 19 : గత ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాలోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందలేదు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిదేళ్ల కిందట ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ప్రశ్నార్థకంగా మారాయి. 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించడంలో గత పాలకులు చొరవ చూపించలేకపోయారు. టెండర్లు ఖరారు చేసి, నిర్మాణాలు ప్రారంభించిన డబుల్ ఇళ్లలో ఇంకా వేల సంఖ్యలో అసంపూర్తిగానే ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడంలోనూ అప్పటి పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. మరికొన్ని ఇళ్ల నిర్మాణాలు జరిగినా వైరింగ్, నీటి కనెక్షన్ వంటి పనులు జరగక అలాగే ఉండిపోయాయి. ఇంకా మొదలుపెట్టని ఇళ్ల సంగతేంటో వారికే తెలియాలి. అధికార వర్గాల సమాచారం మేరకు ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభంకాని చోట స్థల సమస్య ప్రధానంగా నెలకొన్నది. అలాగే బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతుందన్న భావనతో ఆయా ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

కొత్త ప్రభుత్వ నిర్ణయమేంటి?

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అనే పథకాన్ని తీసుకువచ్చిన నేపథ్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి ఏమిటీ అన్న ఆందోళన నెలకొన్నది. ఇప్పటికే పూర్తయిన సగంలో ఉన్న ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తుందా లేదా అన్నది తేలాల్సి ఉంది. అసంపూర్తి దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాల సంగంతేంటో స్పష్టం చేయాల్సి ఉంది.



ఉమ్మడి జిల్లాలో మంజూరైన ఇళ్లు	25,967
నిర్మాణం మొదలైనవి	21,002
పూర్తయినవి	16,365
లబ్ధిదారులకు అందజేసినవి	16,100

మూడు జిల్లాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలు

జిల్లా	సంగారెడ్డి	మెదక్	సిద్దిపేట
మంజూరైన ఇళ్లు	5,934	4,776	15,257
ప్రారంభమైనవి	5,136	3,660	12,000
పూర్తయినవి	4,198	2,567	9,600
అందజేసినవి	4,150	2,050	8,000
అసంపూర్తిగా..	1784	1100	3,257

మెదక్ జిల్లాలో..

- మండలకేంద్రమైన హవేళీఘనపూర్‌లో 40 ఇళ్లు నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. అయితే ఈ ప్రాంతంలో సీసీరోడ్లు వేయలేదు. దాంతో లబ్ధిదారులు వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కోవల్సివస్తుంది. 40 ఇళ్లకు ఒక్కటే ఉన్న సెప్టిక్ ట్యాంకు పొంగి పొర్లుతుండడంతో దుర్వాసన నెలకొన్నది.
- చిన్న శంకరంపేట మండలం కొరివిపల్లిలో మంజూరైన ఎనిమిది ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి.





మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం కొరివిపల్లిలో అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణం

తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో నిరూపయోగంగా ఉన్న ఇళ్లు

సంగారెడ్డి జిల్లాలో..

- అందోలు మండలం తల్మెలలో మంజూరైన 50 డబుల్ బెడ్ రూం ఇళ్లలో నిర్మాణం చేపట్టిన 36 ఇళ్లు ఇంకా బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి.
- చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి, శివంపేటలలో డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మాణం ప్రారంభానికే నోచుకోలేదు.
- నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో మంజూరైన 116 ఇళ్లలో ఒక్కటీ పూర్తి కాలేదు.
- మండలకేంద్రమైన హత్నూరలో మంజూరైన 30 ఇళ్లు, ఇదే మండలం సికింద్లాపూర్‌లో మంజూరైన 14 ఇళ్లలో ఒక్కటీ పూర్తి చేయలేదు.
- సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో మంజూరైన 30 ఇండిపెండెంట్ ఇళ్లు, 20 ఫ్లాట్ల నిర్మాణాలలో ఒక్కదానిని పూర్తి చేయలేదు.
- కొండాపూర్ మండలం అలియాబాద్‌లో నిర్మాణం చేపట్టిన 220 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి.
- పటాన్‌చెరు మండలం చిట్కుల్, ముత్తంగి, మండలకేంద్రమైన జిన్నారం, ఇదే మండలంలోని కొడకంచి, గుమ్మడిదల మండలం కొత్తపల్లిలో 400 ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారయ్యాయి. వీటిలో 240 ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారయ్యాయి. వీటిలో 240 ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా అన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి.
- జహీరాబాద్ అర్బన్‌కు సంబంధించి హోతి (కె)లో నిర్మాణం చేపట్టిన 660 ఇళ్లలో ఒక్కటీ పూర్తి కాలేదు.
- మండలకేంద్రమైన మొగుడంపల్లిలో 150 ఇళ్లు, న్యాల్‌కల్‌లో 150 ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారైనా ఒక్క ఇంటి నిర్మాణాన్ని కూడా మొదలుపెట్టలేదు.

సిద్దిపేట జిల్లాలో..

- గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో మల్లన్నసాగర్ భూనిర్వాసితులు తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. దీంతో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ఇళ్ల పంపిణీ జరగలేదు.
- దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లిలో 18 ఇళ్లను నిర్మించినప్పటికీ పంపిణీ చేయలేదు.
- దుబ్బాక మండలంలోని బల్వంతాపూర్, పెద్ద చీకోడు, చౌదర్‌పల్లి, రఘోత్తమపల్లి, గోసాన్‌పల్లి గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లను అనధికారికంగా కేటాయించడంతో వివాదాస్పదమైంది. అదే విధంగా దుబ్బాక పట్టణంలో నిర్మించిన ఇళ్లలో 108 ఇళ్లను నేటికీ పంపిణీ చేయలేదు.
- మిరుదొడ్డి మండలం భూంపల్లిలో మాత్రమే ఇళ్లను పంపిణీ చేశారు. మిగిలిన చోట్లా పంపిణీ చేయకున్నా ఎవరికివారు వెళ్లి అనధికారికంగా నివాసముంటున్నారు.
- గజ్వేల్ మండలం దాచారంలో డబుల్ ఇండ్లు అసంపూర్తిగా ఉన్నాయి. బిల్లులు ఇవ్వనందువల్లే ఆగిపోయినట్లు తెలిసింది.
- తొగుట మండలం బండారుపల్లి, పెద్దమాసాన్‌పల్లి గ్రామాల్లో డబుల్ ఇళ్లను నిర్మించినా పంపిణీ చేయలేదు. నాయకుల మధ్య ఆధిపత్య పోరు వల్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి కానట్లుగా తెలిసింది.
- ములుగు మండలం బండ మైలారంలో డబుల్ ఇళ్లు అర్థాంతరంగానే నిలిచిపోయాయి.

బీటెక్ చదివి మంత్రినయ్యా..

- నాలుగు దశబ్దాల నుంచి సేవ చేస్తున్నాం
- అందోలు అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తా..
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సాంకేతిక శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

పుల్‌కల్, ఫిబ్రవరి 19: బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చదివి మంత్రిని అయ్యాయనని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గుర్తు చేశారు. సివిల్స్‌కు సిద్ధమయ్యేందుకు ప్రయత్నిస్తుండగానే, తన తండ్రి సిలారపు రాజనర్సింహ ఆకస్మిక మరణంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాజకీయాల్లోకి వచ్చానన్నారు. నాలుగు దశబ్దాలకుపైగా ఈ ప్రాంతానికి తమ కుటుంబం సేవ చేస్తున్నదని తెలిపారు. తమను ఆదరిస్తున్న ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నానన్నారు. చౌటకూర్ మండలంం శివంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, అందోలు మండలం సంగుపేట మహిళా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో సోమవారం వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి-జోగిపేట పట్టణాలకు మధ్య ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయడం ద్వారా ఇరు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయన్న దూరదృష్టితో జేఎన్టీయూను ఏర్పాటు చేశానన్నారు. జేఎన్టీయూ ఏర్పాటు ద్వారా తన స్వప్నం నెరవేరిందన్నారు. గత ప్రభుత్వ పాలన గురించి మాట్లాడదల్చుకోలేదని, ఈ ప్రాంత అభ్యున్నతికి ఏం చేస్తానో అది చేసి చూపెడతానన్నారు. జేఎన్టీయూలో క్లాక్‌టవర్, ఆడిటోరియం, అతిథి గృహం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దాదాపు మూడు గంటలకుపైగా మంత్రి దామోదర రాజనరసింహ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కలియతిరిగారు. ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ ప్లాంట్, వాటర్ ప్లాంట్‌లను సందర్శించారు. కాగా, శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో బాలికలకు వసతి గృహం నిర్మిస్తానని ఆయన హామీఇచ్చారు. ఆయా కళాశాలల్లో రూ.4.30 కోట్లతో సిమెంటు రోడ్లు, ప్రహరీ నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, కలెక్టర్ వల్లూరు క్రాంతి జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ కట్టా నర్సింహ్మారెడ్డి, రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, బిక్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జి.నరసింహ, నాయకులు పాల్గొన్నారు.



జేఎన్టీయూలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్

పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి బాధ్యత నాది


జోగిపేట, ఫిబ్రవరి19 : పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి బాధ్యత తనదని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగుపేటలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాలిటెక్నిక్ కళాశాలలో రూ.68.50 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

అవిశ్వాసాలకు వేళాయే!

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అవిశ్వాస రాజకీయం కొనసాగుతోంది. ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు జరగగా, మండల పరిషత్, పీఏసీఎస్‌లోనూ అవిశ్వాస పర్వానికి తెర లేచింది.

- వచ్చే నెల 6న తూప్రాన్ మున్సిపాలిటీలో
- సంగారెడ్డిలో 7న కౌన్సిల్ భేటి
- 26న జిన్నారం ఎంపీపీ అవిశ్వాస సమావేశం

తూప్రాన్, ఫిబ్రవరి 19: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై మార్చి 6న ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు కలెక్టర్ రాజర్షిషా సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. తూప్రాన్ మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులుంగా ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 11, కాంగ్రెస్ 2, బీజేపీ 1, ఇండిపెండెంట్లు ఇద్దరు నెగ్గారు. అయితే అవిశ్వాసానికి 11 మంది కౌన్సిలర్లు అవసరముంది. చైర్మన్ వర్గంలో ఆరుగురు కౌన్సిలర్లు ఉండగా, వ్యతిరేక వర్గంలో 10 మంది ఉన్నారు. చైర్మన్ వర్గం నుంచి ఓ కౌన్సిలర్ వ్యతిరేక వర్గంలో చేరయడంతో కోరం సమకూరింది. దాంతో 12న చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కలెక్టర్‌కు తీర్మాన పత్రాన్ని అందజేశారు. బీఆర్ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటికే ఇద్దరు కౌన్సిలర్లు ఉండగా, కాంగ్రెస్ బలం పదికి చేరుకున్నది. బీజేపీ కౌన్సిలర్ సైతం కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటిస్తున్నారు. అవసరమైన 11 మంది సభ్యుల మద్దతు లభించడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రోజే క్యాంపునకు తరలివెళ్లారు. మరికొందరు చేజారిపోకుండా ఆదివారం క్యాంపునకు తరలి వెళ్లినట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానంపై మార్చి 6న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేశారు. చైర్మన్ వర్గానికి చెందిన ఐదుగురు తీసుకోలేదని తెలిసింది. దీంతో నోటీసులు అతికించడం, వాట్సా‌ప్‌లో పంపడం, పోస్టు చేయడం వంటివి చేస్తున్నారు. మున్సిపల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎవరు నమోదు చేసుకోలేదని తెలిసింది.



తూప్రాన్‌లో ఓ కౌన్సిలర్ ఇంటి గోడకు అంటించిన నోటీసు

సంగారెడ్డిలోనూ వచ్చే నెల సమావేశం

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 19 : సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం కోసం వచ్చే నెల 7న కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. అయితే 37 మంది కౌన్సిలర్లు ఉన్న బల్దియాలో చైర్‌పర్సన్‌ను గద్దెదించాలంటే 26 మంది మద్దతు అవసరం ఉంటుంది. అనుకూలంగా ఉన్న మెజార్టీ కౌన్సిలర్లను సోమవారం రాత్రికి క్యాంపునకు తరలించినట్లు తెలిసింది.

వావిలాల పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస అస్త్రం

జిన్నారం, ఫిబ్రవరి 19 : జిన్నారం మండలం వావిలాల ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) బీఆర్ఎస్‌కు చెందిన పీఏసీఎస్ చైర్మన్ శంకర్‌రెడ్డిపై కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాస నోటీసును అందజేశారు. ఏడుగురు కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు జిల్లా సహకార సంఘం అధికారికి సంగారెడ్డిలో సోమవారం అవిశ్వాస నోటీసును అందజేశారు. సొసైటీలో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గానూ ఏడుగురు అవిశ్వాస నోటీసును అందజేయగా మరో ఇద్దరి మద్దతు తమకు ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రతిపాదించగా ఈనెల 26న ప్రత్యేక సమావేశం జరుగనుంది. మండల పరిషత్ పీఠంపై పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌కు కౌంటర్‌గా కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్‌పై దృష్టి సారించినట్లు తెలుస్తుంది.

సత్వరమే పరిష్కారం చూపాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 19 : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఆమె బాధితుల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 47 ఫిర్యాదులు వచ్చాయని ఆమె తెలిపారు. ఖేడ్- నిజాంపేట్- బీదర్161బీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వ్యవసాయ భూములు, ఇల్లు, స్థలాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కోరుతూ ప్రజావాణిలో అధికారులకు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యంతో పాటు ఆ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు.



మెదక్‌లో దరఖాస్తు తీసుకుంటున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ ప్రజావాణికి 91 దరఖాస్తులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 19: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు చేరవేయాలంటే అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణికి 91 వినతులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎస్పీ బాలస్వామి దరఖాస్తులను స్వీరించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



మెదక్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



ఖేడ్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామంలో శివాజీ విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
- మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జయంతి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ ఆశయాలను నేటి యువత కొనసాగించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. సోమవారం శివాజీ జయంతిని పురస్కరించుకొని పట్టణ శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానం నుంచి పురవీధుల గుండా బైక్ శోభాయాత్ర సాగింది. రాందాస్ చౌరస్తాలో శివాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు మాయశంకర్, కానుగు రాము, నాయిని ప్రసాద్, జగదీశ్వర్, కామేశ్వర్‌రావు, గొల్ల పవన్, చెన్నరాంచంద్రం, నిజాంపేట జడ్పీటీసీ విజయ్‌కుమార్, బీజేపీ అధికార ప్రతినిధి నందారెడ్డి, జిల్లా నాయకులు విజయ్, నాగరాజు, యువత పాల్గొన్నారు.

●**నర్సాపూర్:** శివాజీ జయంతిని నర్సాపూర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. 4వ వార్డులో ఉన్న శివాజీ విగ్రహం వద్ద పలువురు ప్రముఖులు పూలమాలవేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్ రామచందర్, బీఆర్ఎస్ పట్టణ నాయకులు భిక్షపతి, నగేష్, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, కొండికమార్, ప్రభాకర్‌తో పాటు బీజేపీ కౌన్సిలర్లు బుచ్చేస్ యాదవ్, యాదగిరి కూడా వేరుగా నివాళులర్పించారు.

●**తూప్రాన్:** తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తాలో ఉన్న శివాజీ విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు.

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండల కేంద్రంలోని రామాయపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ ఫుడ్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామం నుంచి చౌరస్తా వరకు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

●**రేగోడు:** రేగోడుతో పాటు ప్యారారం, కొండాపూర్, టి లింగంపల్లి, వెంకటాపూర్, కొత్వాల్‌పల్లి, కొండాపూర్, జగిర్యాల, చౌదర్‌పల్లి, మర్పల్లి గ్రామాల్లో సోమవారం శివాజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు.

●**శివ్వంపేట:** మండల కేంద్రమైన శివ్వంపేటలో శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు నవీన్‌గుప్తా, కొడకంచిశ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

●**అల్లాదుర్గం:** అల్లాదుర్గంలో శివాజీ జయంతిని సోమవారం నిర్వహించారు. మండలంలో అప్పాజీపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శ్రీసద్గురు సర్వేశ్వరా శివయోగమని ఆవిష్కరించారు.

●**చిలప్‌చెడ్:** మండలం పరిధిలోని పలు గ్రామాల్లో శివాజీ జయంతిని నిర్వహించారు. అజ్జమర్రి గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆదేవిధంగా మండలం పరిధిలోని చిట్కుల్, బండాపోతుగల్, గౌతాపూర్, ఫైజాబాద్, చండూర్ తదితర గ్రామాల్లో బైకు ర్యాలీలు నిర్వహించారు.

●**వెల్దుర్తి:** ఛత్రపతి శివాజీ జయంతిని మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.

●**చేగుంట:** నార్సింగి మండలం నర్సంపల్లి గ్రామంలో సోమవారం వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు విగ్రహదాత చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి జయంతి రోజే విగ్రహం ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉన్నదన్నారు.

●**రామాయంపేట:** మండల కేంద్రమైన రామాయంపేటలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి యువసేన నేతృత్వంలో శివాజీ విగ్రహాన్ని ఓ వాహనంపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్‌తో పాటు నిజాంపేట్ జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, టీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు పాత హైవేపై శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

●**చిన్నశంకరంపేట:** మండలంలోని వెంట్రావుపల్లిలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎంపీటీసీ నాగరాజు భూమి పూజ చేశారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, యువజన సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 19: సంగారెడ్డిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డులోని హనుమాన్ ఆలయం నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా, కలెక్టరేట్, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా తిరిగి బైపాస్ రోడ్డులోని శివాజీ చౌక్ వరకు భారీ బైక్ నిర్వహించారు. అనంతరం అక్కడ శివాజీ చిత్రపటానికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, ఛత్రపతి శివాజి మహరాజ్ యూత్ అసోసియేషన్ నాయకులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

●**నారాయణఖేడ్:** ఛత్రపతి శివాజీ జయంతిని నారాయణఖేడ్‌లో అట్టహాసంగా నిర్వహించారు. శోభాయాత్ర ప్రారంభానికి ముందు నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గామాత ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మంగల్‌పేట నుంచి శివాజీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాగా శివాజీ జయంతి సందర్భంగా పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి పూజలు నిర్వహించారు.



జహీరాబాద్ పట్టణంలో శివాజీ చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

●**వట్‌పల్లి:** మండల కేంద్రమైన వట్‌పల్లితో పాటు మండలంలోని నాగులపల్లి, బూత్కూర్, దేవునూర్, గొర్రెకల్ గ్రామాల్లో శివాజీ జయంతిని నిర్వహించారు. బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మరవెల్లి నుంచి మేడుకుంద వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

●**కంగ్టి:** మండల కేంద్రమైన కంగ్టితో పాటు తడ్కల్, రాసోల్, గాజుల్‌పాడ్, సుక్కల్ తీర్థ్, బోర్గి, భీంరా తదితర గ్రామాల్లో సోమవారం శివాజీ జయంతి నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శివాజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.

●**నాగల్‌గిద్ద:** మండల కేంద్రమైన నాగల్‌గిద్దతో పాటు ఆయా గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు మాణిక్‌రావుపటేల్, సంజీవ్‌పటేల్, సుభాష్‌పాటిల్ ఉన్నారు.

●**జిన్నారం:** జిన్నారం మండలవ్యాప్తంగా ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. సోమవారం పెద్దమ్మగూడెం చౌరస్తా, గడ్డపోతారంలో శివాజీ విగ్రహాల వద్ద బీజేపీ నాయకులు నివాళులర్పించారు.

●**రాయికోడ్:** మండల కేంద్రమైన రాయికోడ్‌తోపాటు పలు గ్రామాల్లో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు.

●**కల్హేర్/సిర్గాపూర్:** సిర్గాపూర్, కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్, రాపర్తిలోని శివాజీ విగ్రహాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్హేర్‌లోని బస్టాండ్ కూడలిలో శివాజీ చిత్రపటానికి పూజలు నిర్వహించి జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ కోప్షన్ సభ్యుడు ఎండీ.అలీ, బీజేపీ మండలాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు అల్లాపురం రాజు పాల్గొన్నారు.

●**జహీరాబాద్:** శివాజీ జయంతి సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ నుంచి ప్రధాన వీధుల గుండా బస్టాండ్, ఆర్యనగర్‌లోని శివాజీ విగ్రహం వరకు శోభాయాత్రను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక మహిళ ఆత్మహత్య

పాపన్నపేట, ఫిబ్రవరి 19: అప్పులు ఇచ్చినవారి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకున్నది. పాపన్నపేట మండల పరిధిలోని అమియాతండాకు చెందిన లునావత్ విజ్యా(30) భర్త దీప్లా మూడేళ్ల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నది. కొద్ది రోజులుగా ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. అప్పులు ఇచ్చినవారి నుంచి వేధింపులు రావడంతో తరచూ బాధపడుతుండేది. దీంతో మనస్తాపానికి గురైన విజ్యా సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 19: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్‌లోని డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన సంఘం శ్రీరాములు(45) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నాళ్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి వద్ద కూడా డ్రైవర్‌గా పనిచేశాడు. గతంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొద్దిరోజులుగా ఉపాధి లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహ్యాతకు చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

గౌతోజీగూడెంలో వ్యక్తి అదృశ్యం

మనోహరాబాద్, ఫిబ్రవరి 19: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని గౌతోజిగూడెంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చుక్క క్రిష్ణ(55) వారం క్రితం 11న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువుల, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై క్రిష్ణ కుమారుడు గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హష్ ఆయిల్ పట్టివేత



నిందితులను చూపుతున్న అధికారులు

జహీరాబాద్, ఫిబ్రవరి 19: జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు రూ.40వేలు విలువ చేసే లిక్విడ్ గంజాయి (హష్ ఆయిల్)ను తరలిస్తున్న ఇద్దరు నిందితులతో పాటు కారును స్వాధీనం చేసుకుని సోమవారం పోలీసులకు అప్పగించామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. గోవా నుంచి హైదరాబాద్‌కు 40 కిలోల గంజాయి నుంచి తీసిన 4.2 గ్రాముల హష్ ఆయిల్‌ను అక్రమంగా తరలిస్తున్న క్రమంలో చిరాగ్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నామన్నారు. ఎక్సైజ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఎక్సైజ్ చెక్‌పోస్టు సిబ్బంది కలిసి తనిఖీలు చేసి పట్టుకున్నామన్నారు. హష్ ఆయిల్‌ను తరలిస్తున్న అశ్రిత్‌యాదవ్, ఆషీష్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించామని ఆయన తెలిపారు.

నార్సింగిలో దొంగల బీభత్సం

చేగుంట, ఫిబ్రవరి 19: నార్సింగి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన గోత్రాల శ్రీకాంత్, పంపరి జనార్ధన్, బోడ భూపాల్ ఇళ్లలోకి వెళ్లిన దొంగలు బీరువా పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి, నగదు దోచుకెళ్లారు. ఒకేరోజు మూడిళ్లలో చోరీ జరగడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. దొంగతనాలు జరిగిన ఇళ్ల వద్ద క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. సుమారు రూ.2 లక్షల వరకు చోరీకి పాల్పడి ఉంటారని పేర్కొన్నారు. నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసుదర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ పైకి దూసుకెళ్లిన వ్యాన్

రామాయంపేట, ఫిబ్రవరి 19: పట్టణంలోని మెదక్ చౌరస్తా మలుపులో వేగంగా వస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. సోమవారం తెల్లవారుజామున మెదక్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్నది. ఈ క్రమంలో డ్రైవర్ నిద్రమత్తులో వేగంగా నడపడంతో రామాయంపేటలోని డివైడర్ పైకి ఎక్కింది. అయితే ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

పోలీసులమని బెదిరించి బంగారు ఉంగరాలు లాక్కెళ్లిన దుండగులు

చేగుంట, ఫిబ్రవరి 19: పోలీసులమని బెదిరించి బైక్‌పై వస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడిని దారి దోపిడీ చేసిన ఘటన చేగుంట మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకున్నది. బాధితుడు దొడ్ల రామచంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ పొలం నుంచి బైక్‌పై వస్తుండగా బైపాస్ బ్రిడ్జి వద్ద ఇద్దరు వ్యక్తులు వాహనం ఆపి, తాము పోలీసులమని చెప్పారు. మరో వ్యక్తి కత్తి చూపించి తన చేతికి ఉన్న రెండు ఉంగరాలను లాక్కున్నాడని, గొలుసును లాక్కొనే ప్రయత్నం చేయగా నిలువరించినట్లు వెల్లడించాడు. రెండున్నర తులాల బంగారు ఉంగరాలను దుండగులు లాక్కుని పారిపోయారని బాధితుడు వాపోయాడు. చేగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దోపిడీకి పాల్పడిన నిందితులను గుర్తించేందుకు పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

'మానసిక దివ్యాంగులకు సహాయ సహకారాలు'

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 19: మానసిక దివ్యాంగులకు సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి తెలిపారు. సంగారెడ్డిలోని సబిత కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించాచరు. మానసిక దివ్యాంగులకు అండగా ఉంటామన్నారు. అనంతరం విద్యార్థుల విద్యాస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీపీవో రత్నం, నిర్వాహకులు శ్రీనివాస్, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్ మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 19: నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్‌గా జగ్‌జీవన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన మల్లారెడ్డిని బెల్లంపల్లికి బదిలీ చేసి, ఆయన స్థానంలో ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జగ్‌జీవన్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన జగ్‌జీవన్‌ను మున్సిపల్ సిబ్బంది, శాలువా కప్పి సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రేణుకామాత విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ పూజలు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 19: మండలంలోని భూర్గుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రేణుకామాత విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సోమవారం పూజలు చేశారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఎల్లమ్మతల్లి దయతో ప్రజలు, పశుపంటలు చల్లగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ అర్చనాశ్రీనివాస్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ ఫొటో చించివేతపై ఫిర్యాదు

నర్సాపూర్, ఫిబ్రవరి 19: నర్సాపూర్ పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన కటౌట్‌ల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఫొటోను కొందరు చించివేశారంటూ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అశోక్‌గౌడ్ నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా పట్టణంలోని పలుచోట్ల కటౌట్లు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న అశోక్‌గౌడ్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు: ఎంపీడీవో

నర్సాపూర్, ఫిబ్రవరి 19: నర్సరీల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహించకూడదని ఎంపీడీవో మధులత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మాడాపూర్, రామచంద్రాపురం గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను ఆమె పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

కనుల పండువగా మల్లన్న జాతర

శివ్వంపేట, ఫిబ్రవరి 19: మండలంలోని పిల్లుట్ల, పాంబండ గ్రామాల్లో సోమవారం మల్లన్న జాతర నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బట్టెమ్మకు బోనాలు

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 19: మండలం పరిధిలోని గౌతాపూర్‌లో సోమవారం బట్టెమ్మతల్లికి బోనాలు సమర్పించినట్లు కుమ్మర సంఘం అధ్యక్షుడు శంకరయ్య పేర్కొన్నారు. గ్రామ దేవతల తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహించినట్లు తాజా, మాజీ సర్పంచ్ స్వరూపావిఠల్ పేర్కొన్నారు. ప్రజలు, దాతల సహాయంతో గ్రామ దేవతలైన దుర్గమ్మ, పోచమ్మతల్లుల వార్షికోత్సవాన్ని నిర్వహించుకున్నట్లు తెలిపారు.

సమాచారం

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా నారాయణరెడ్డి

చేగుంట: బీఆర్ఎస్ చేగుంట మండలాధ్యక్షుడిగా కోమాండ్ల నారాయణరెడ్డి ఎన్నికయ్యారు. తూప్రాన్ మండల శివారులోని రామాయపల్లి అతిథి గృహంలో సోమవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వండి

చిన్నశంకరంపేట: రామాయంపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఒకసారి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రవిచంద్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతం కృషి చేశామన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నా వదలలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం గుర్తించి అవకాశం కల్పించాలని కోరారు.

ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

నాగల్‌గిద్ద: మండల పరిధిలోని ముక్టాపూర్ శివారులో నూతనంగా నిర్మించిన ఫిల్లింగ్ స్టేషన్‌ను సోమవారం జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి, కురుమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, హాజరయ్యారు.

నేడు సదరం స్లాట్లు, 27న క్యాంపు

సంగారెడ్డి అర్బన్: దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును 27న సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్లు ఈనెల 20న కేటాయిస్తామని పేర్కొన్నారు. మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని క్యాంపునకు హాజరుకావాలని ఆమె కోరారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

చేగుంట: మహవీర్ ఇంటర్నేషనల్ సంస్థ సికింద్రాబాద్ వారి సౌజన్యంతో సోమవారం చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం సంస్థ ప్రతినిధి బాదల్‌జైన్ మాట్లాడారు. విద్యార్థులు టెక్నికల్ కోర్సులపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఆయన సూచించారు.

శ్రీనివాస్ మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రేగోడు: టి లింగంపల్లి మాజీ సర్పంచ్ బగిలి అనుమవ్వ మృతి చెందగా ఆయన కుమారుడు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు బగిలి శ్రీనివాస్‌ను ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పరామర్శించారు. కాగా అదేరాత్రి రేగోడులో జరిగిన బీఆర్ఎస్ నాయకుని శుభకార్యానికి హాజరయ్యారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బుచ్చయ్య, ఎంపీటీసీ నర్సింహులు ఉన్నారు.

ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట, ఫిబ్రవరి 19: ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం పాపన్నపేట ఐకేపీ భవనంలో ఎంపీపీ చందనారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వచ్చేది వేసవికాలం కావున నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. గ్రామాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సభలో సమస్యలను విన్నవించారు. కొత్తపల్లి శివారులోని వంతెన వద్ద ఇరువైపులా తారు రోడ్డు లేకపోవడంతో దమ్ములేచి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పాపన్నపేట ఎంపీటీసీ శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పోడ్చన్‌పల్లిలో పలువురు ఫోన్లుచేసి వేధింపులకు గురిచేస్తున్నారని, ఆ గ్రామ ప్రత్యేకాధికారి వెంకట రమణమ్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని ఆమెకు భరోసా ఇచ్చారు. అనంతరం మల్లంపేటలో శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గాంధారిపల్లిలో ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు, శానాయిపల్లిలో బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, కోఆప్షన్ సభ్యుడు గౌస్, కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేష్‌గుప్తా పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఫిబ్రవరి 19: అర్హులైన వారికి రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ శివారులోని కన్వెన్షన్ సెంటర్‌లో 283 మందికి షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను అందజేసి మాట్లాడారు. తమ ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ భాస్కర్, సేవాలాల్ సంఘం నాయకులు రమేష్ చౌహాన్, ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముంతాజ్ పాల్గొన్నారు. కాగా నారాయణఖేడ్ మండలం నర్సాపూర్‌లో బోరు బావిని, సీసీరోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం నారాయణఖేడ్ క్యాంపు కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి పంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ పల్లెలు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ పాల్గొన్నారు.

వ్యాపారంలో మెళకువలు నేర్పడం కోసమే 'విపణి'



విపణి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ అరుణాబాయి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 19: వ్యాపారంలో మెళకువలు నేర్పడం కోసమే ఈ నెల 21న కళాశాలలో 'విపణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అరుణాబాయి తెలిపారు. సంగారెడ్డిలోని కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళాశాలలో 2012 నుంచి విపణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరు వ్యాపారతత్వం అలవర్చుకోవాలనే ఉద్దేశంతో విపణి కార్యక్రమన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విపణి అనుభవాలు భవిష్యత్తులో స్థిరపడడమే కాకుండా పది మందికి ఉపాధి కల్పించే స్థాయిలో మంచి పౌరులుగా ఎదగడానికి దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు హుమేరాసయీద్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఆర్డీవోగా రాజు

జహీరాబాద్, ఫిబ్రవరి 19: జహీరాబాద్ ఆర్డీవోగా రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హుజూరాబాద్ నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అందులో భాగంగా ఆయా మండలాలకు చెందిన అధికారులు సన్మానించారు. ఇప్పటివరకు జహీరాబాద్ ఆర్డీవోగా విధులను నిర్వహించిన వెంకారెడ్డి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీవో మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో కృషిచేస్తామన్నారు.

స్టాఫ్ నర్సులను నియమించాలి

- జిల్లా వైద్యాధికారికి బీఆర్ఎస్‌కేవీ నాయకుల విజ్ఞప్తి

హత్నూర, ఫిబ్రవరి 19: మండల కేంద్రమైన హత్నూర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి స్టాఫ్ నర్సులను నియమించాలని బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు బీవీ.శివశంకరరావు కోరారు. ఈ విషయమై సోమవారం జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ ఆస్పత్రికి చుట్టుపక్కల ఉన్న వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ 150 నుంచి 200 వరకు పేషెంట్స్ వస్తుంటారని తెలిపారు. ఆస్పత్రిలో అత్యవసర చికిత్సలు చేసేందుకు నలుగురు పర్మినెంట్ స్టాఫ్ నర్సులు అవసరం ఉంటే ఒక్కరు కూడా లేరని వాపోయారు. డెలివరీ కోసం వచ్చే పేద కుటుంబానికి చెందిన మహిళలు ఆస్పత్రిలో సరైన స్టాఫ్ లేక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి రూ.50 వేల వరకు ఖర్చు చేసుకుంటూ అప్పుల పాలవుతున్నారని అన్నారు. వెంటనే నలుగురు శాశ్వత స్టాఫ్ నర్సులను నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు.

'ఎంఆర్ఎఫ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 19: కార్మిక హక్కులు కాలరాస్తున్న అంకెన్‌పల్లి ఎంఆర్ఎఫ్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం కార్మిక శాఖ ఉపకమిషనర్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఆర్ఎఫ్ పరిశ్రమ అధికారులు కార్మికులను తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. చట్టప్రకారం గెలిచిన యూనియన్‌కు కనీస గౌరవం ఇవ్వడం లేదని వాపోయారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రఫీ, మధుకర్‌రెడ్డి, అంబదాస్, విజేందర్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠ భూమిలో అక్రమ నిర్మాణాలు

హత్నూర, ఫిబ్రవరి 19: గ్రామకంఠం భూమిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సాదుల్లానగర్ గ్రామస్థులు ఎంపీడీవో శంకర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామ ప్రత్యేకాధికారి, కార్యదర్శి దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వెంటనే అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేసి, వారిపై చర్య తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు. వినతి పత్రం ఇచ్చినవారిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణ, నాయకులు ప్రసాద్, రాజు, మల్లేశం, శేఖర్‌గౌడ్ ఉన్నారు.



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న సాదుల్లానగర్ గ్రామస్థులు

విపత్కర పరిస్థితుల్లో సమయ స్ఫూర్తిని ప్రదర్శించాలి

- ఆర్డీవో జయచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో, పక్కన డీఎస్పీ, కమిషనర్

తూప్రాన్, ఫిబ్రవరి 19: విపత్కర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో సమస్ఫూర్తిని ప్రదర్శించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని గురుకుల పాఠశాల, కళాశాలలో ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తుఫాన్, పిడుగు పాటు, వడగళ్లవాన, భూకంపం సంభవించినప్పుడు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని ఎదుర్కొనే విధానాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సిబ్బందికి, విద్యార్థులకు చూపించారు. సీపీఆర్ చేసి చివరి క్షణాల్లో ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ సోమ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందం, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్‌యాదవ్, ఏఎస్ఐ మద్దిలేటి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి: పీఆర్‌టీయూ



మాట్లాడుతున్న చెన్నయ్య

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 19: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య తెలిపారు. సంగారెడ్డిలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం ఆయన సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయులు తీవ్రంగా ఎదుర్కొంటున్న సమస్య 317 జీవో, పదోన్నతులు, బదిలీలు, సీపీఎస్ రద్దు, దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలు, ఆర్థికపరమైన బిల్లుల చెల్లింపులు తదితర సమస్యలన్నింటిని పరిష్కరించడానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందన్నారు. పాఠశాలల ప్రారంభానికి ముందే స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి కృష్ణరెడ్డి, నాయకులు అశోక్, సునీల్ పాల్గొన్నారు.